# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 06-05-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1)** **రాష్ట్రంలో లభించే ఇనుప ఖనిజాన్ని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాన్ని స్టీల్ హబ్‌గా తీర్చిదిద్దే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అన్నారు.**

**2)** **ఆంధ్రప్రదేశ్‌లో గుంతకల్ - వాడి మధ్య నిర్మించే 3వ, 4వ రైల్వే లైన్ నిర్మాణ పనులకు కేంద్ర మంత్రిమండలి ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోదం తెలిపింది.**

**3)** **ప్రాథమిక, ఉన్నత పాఠశాల, సాంకేతిక విద్యతో పాటు వైద్య విద్య సిలబస్‌లో కృత్రిమ మేథ వినియోగం, దాని ఉపయోగంపైన ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు.**

**4)** **ఆంధ్రప్రదేశ్ లోని తిరుపతి జిల్లా శ్రీ సిటీలో వెయ్యి కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటుచేస్తున్న ఎయిర్ కండీషన్ల తయారీ యూనిట్‌కు ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఈరోజు శంకుస్థాపన చేయ నున్నారు.**

==========================

రాష్ట్రంలో లభించే ఇనుప ఖనిజాన్ని సద్వినియోగం చేసుకుంటే రాష్ట్రాన్ని స్టీల్ హబ్‌గా తీర్చిదిద్దే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో ఉక్కు రంగంలో 1.90 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు రానున్నాయని ఆయన చెప్పారు. తద్వారా లక్షా 52 వేల మందికి ఉద్యోగాలు వస్తాయని అన్నారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి నిన్న గనుల శాఖపై సమీక్ష నిర్వహించారు. రాబోయే పెట్టుబడులకు అనుగుణంగా ఇనుప ఖనిజ ఉత్పత్తి పెంచాలని చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ముమ్మందు ఇనుప ఖనిజ విని యోగం 4 రెట్లు పెరగనుందని, ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలోని వెయ్యి 338 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజ నిల్వలతో ప్రభుత్వానికి రాబడి పెరిగే వీలుంటుందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి అన్నారు.

-------------------------

వెలుగొండ ప్రాజెక్టును 2026 సీజన్ కల్లా పూర్తి చేసి నీరు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం కొత్తూరు వద్ద నిర్మాణంలో ఉన్న వెలుగొండ ప్రాజెక్ట్ టన్నెల్ వద్ద నిన్న ఆయన అధికారులతో ప్రాజెక్టు పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి రామానాయుడు విలేకరులతో మాట్లాడుతూ, వచ్చే సీజన్ కల్లా

వెలుగొండ ప్రాజెక్టును పూర్తిచేసే లక్ష్యంతో పనులను యుద్ధ ప్రాతిపదికన చేస్తున్నామని తెలిపారు. ఇటీవల డీజిల్ కొరత సిబ్బంది కొరత వంటి కారణాలతో పనులలో కొంత జాప్యం జరిగిందని, వీటిని త్వరలోనే అధిగమించి నిర్దేశిత సమయంలోగా పూర్తి చేస్తామని చెప్పారు. ప్రాజెక్టు పురోగతిపై ముఖ్యమంత్రి వారం వారం స్వయంగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారని, తాను 15 రోజులకు ఒకసారి ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో సందర్శిస్తూ అధికారులతో సమన్వయం చేస్తూ పనులను వేగవంతం చేయిస్తున్నానని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గుంతకల్ – వాడి మధ్య నిర్మించే 3వ, 4వ రైల్వే లైన్ నిర్మాణ పనులకు కేంద్ర మంత్రిమండలి ఆర్థిక వ్యవహారాల కమిటీ ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన నిన్న ఢిల్లీలో సమావేశమైన కమిటీ రైల్వే మంత్రిత్వ శాఖ పరిధిలో 23 వేల 437 కోట్ల రూపాయలతో చేపట్టే 3 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. ఈప్రాజెక్టులలో: గుంతకల్ వాడీ తో పాటు, నాగ్దా – మధుర 3వ, 4వ రైల్వే లైన్ పనులు, బుధ్వాల్ – సీతాపూర్ 3వ, 4వ లైన్ నిర్మాణ పనులు ఉన్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవ భారత్ దార్శనికతకు అనుగుణంగా ఇవి రూపొందుతున్నాయి. ఈ ప్రాజెక్టులను పీఎం–గతిశక్తి జాతీయ బృహత్ప్రణాళిక ఆధారంగా రూపొందించారు. ప్రయాణికులు, వస్తువులు, సేవల రవాణాలో ఈ ప్రాజెక్టులు నిరంతరం అనుసంధానం కల్పిస్తాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లోని 19 జిల్లాల మీదుగా మూడు ప్రాజెక్టులు నిర్మాణం కానున్నాయి.

---------------------------

రాజధాని రైతుల సమస్యలు పరిష్కరిచేందుకు అధికారులు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆంధ్రప్రదేశ్ పుర పాలక శాఖమంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు. రాజధాని రైతుల సమస్యలు పరిష్కరించేందుకు అమరావతిలోని సీఆర్డీఏ కార్యాలయంలో నిన్న త్రిసభ్య కమిటీ సమావేశమై పలు సమస్యలపై చర్చించింది. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ...

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

ప్రాథమిక, ఉన్నత పాఠశాల, సాంకేతిక విద్యతో పాటు వైద్య విద్యా సిలబస్‌లో కృత్రిమ మేధ వినియోగం, దాని ఉపయోగంపైన ఉన్నతస్థాయి కమిటీని నియమిస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చెప్పారు. ఈ విషయంలో తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ ను ఆయన కోరారు. తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికపై నిన్న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రఘురామ్ రాజన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. కృత్రిమ మేధ వినియోగంతో పాటు మధ్య స్థాయి ఉద్యోగాల కల్పన కోసం స్కిల్స్ యూనివర్సిటీ, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను, ఏటీసీలను అభివృద్ధి చేస్తున్నట్లు రేవంత్ రెడ్డి వివరించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లా శ్రీ సిటీలో వెయ్యి కోట్ల రూపాయల పెట్టుబడితో ఏర్పాటు చేస్తున్న ఎయిర్ కండీషన్ల తయారీ యూనిట్‌కు ఐటీ విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఈ రోజు శంకుస్థాపన చేయనున్నారు.

ఏసీ తయారీ రంగంలో పేరొందిన క్యారియర్ గ్లోబల్ సంస్థ 1000 కోట్ల రూపాయల పెట్టుబడితో శ్రీసిటీలో అత్యాధునిక తయారీ యూనిట్‌ను స్థాపించనుంది. ఇళ్ళలో, కార్యాలయాల్లో ఉపయోగించే ఒక టన్ను,రెండు టన్నుల సామర్థ్యం కలిగిన ఏసీలే కాకుండా డేటా సెంటర్లు,భారీ పారిశ్రామిక సముదాయాలకు వినియోగించే 1000 టన్నుల నుంచి 5000 టన్నుల సామర్థ్యం కలిగిన బారీ కూలింగ్ సిస్టమ్స్‌ను ఇక్కడ తయారుచేయనున్నారు. శ్రీసిటీ పరిధిలోని ఆరూరు వద్ద ఈ పరిశ్రమకు ప్రభుత్వం 40 ఎకరాల స్థలం కేటాయించింది . ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా వెయ్యి మందికి, పరోక్షంగా రెండు వేల మందికి ఉపాధి లభించే అవకాశం ఉంది.

---------------------------

దక్షిణ కోస్తా రైల్వే జోన్ ప్రధాన కార్యాలయాన్ని విశాఖ పట్నంలో ఏర్పాటు చేయటం శుభ పరిణామం అని భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ అన్నారు. ఈ ఏడాది జూన్ నుంచే ఇక్కడ అధికారిక కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని మాధవ్ వివరిస్తూ ..

..వాయిస్.. 25 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఏడాదికి 450 లక్షల మెట్రికల్ టన్నుల ఉద్యాన శాఖ ఉత్పత్తులు సాధించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. 2026-27 సంవత్సరానికి నాబార్డు రూపోందించిన 5.11 లక్షల కోట్ల రూపాయల వార్షిక రుణ ప్రణాళికను ఆయన నిన్న అమరావతి సచివాలయంలో ఆవిష్కరించారు. హార్టికల్చర్‌ను ప్రోత్సహించాలనే ప్రభుత్వ ఆలోచనలకు మద్దతుగా ఉండాలని బ్యాంకులు, నాబార్డ్ ప్రతినిధులను ముఖ్యమంత్రి కోరారు. ఈ సందర్భంగా హార్టికల్చర్‌లో ప్రభుత్వ లక్ష్యాలను ముఖ్యమంత్రి వివరించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతిలో వ్యవసాయం అందులోనూ... హార్టికల్చర్, ఆక్వాకల్చర్ కీలక పాత్ర పోషిస్తున్నాయని చంద్రబాబు నాయుడు అన్నారు. దీనికి అవసరమైన పూర్తి సహకారాన్ని బ్యాంకులు, నాబార్డ్ అందించాలని ముఖ్యమంత్రి కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో రాగల రెండురోజుల్లో తేలికపాటి నుండి ఓ మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్దితిని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వివరిస్తూ

..వాయిస్.. 22 సెకన్లు

తెలంగాణలో రాగల నాలుగు రోజుల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అక్క దక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

====================